క్లుప్తంగా

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి



ధన్వాడ: ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధికోసం కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మాకం సురేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆయా బూత్‌లలో నూతన కమిటీలకు ఎన్నికలు నిర్వహించారు. బూత్ కమిటీల అధ్యక్షులుగా లక్ష్మీనారాయణ, సంజీవరాయుడు, చక్రవర్ధన్‌ను ఎన్నుకున్నారు. వచ్చే పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందేవిధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, ఉదయభాను, కథలప్ప, మురళి, రవి, రాములు, బాలరాజు, నర్సింహులు, రాజశేఖర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహాపడిపూజ

మరికల్: మండలంలోని ఎక్లాస్‌పూర్‌లో మంగళవారం అయ్యప్పమాలధారులు భక్తిశ్రద్ధలతో స్వామివారికి మహాపడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి విగ్రహానికి ప్రత్యేకంగా అలంకరణ చేసి అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పడిపూజలో స్వాములు అయ్యప్ప భక్తిగీతాలను ఆలపించారు.

జాతర మహోత్సవానికి ఆహ్వానం



మాగనూర్: మండల పరిధిలోని నేరడగం శ్రీ పశ్చిమాద్రి సంస్థన విరక్త మఠం జాతర వచ్చే నెల 16న జరుగుతుందని సిద్ధలింగ మహాస్వాములు తెలిపారు. జాతర సందర్భంగా మైసూరు ప్రాంతం మన్నహారాజ నిరంజన్ జగద్గురును మఠం పీఠాధిపతి పంచమ సిద్ధలింగమహాస్వాములు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో వివిధ మఠాధిపతులు, స్వామిజీలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



మద్దూరు: జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్‌లో జిల్లా స్థాయిలో వాలీబాల్‌లో మండల వాలీబాల్ క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి మొదటి బహుమతి సాధించారు. దీంతో మంగళవారం మండల వాలీబాల్ అసోసియేషన్ వారు ఈ క్రీడాకారులను సన్మానించి అభినందించారు. ఇలాంటి పథకాలను మరిన్ని తీసుకురావాలని అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అధిక్ తెలియజేశారు. కార్యక్రమంలో సభ్యులు విఠల్, మహేందర్, రాజు, రవి, రఘు, హన్మనాయక్, రమేష్, శాంతు, మహేష్, వెంకటేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మరికల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని కోరుతూ.. మంగళవారం హైదరాబాద్‌లో చేపట్టిన ధర్నాకు వెళ్తున్న వారిని పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేయడంతో వారు పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమతో వెట్టిచాకిరి చేయించుకోవడం తగదన్నారు. వెంటనే ప్రభుత్వం తమను రెగ్యులర్ చేసి న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో గీత, మంజుల, వరలక్ష్మి, రాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పాల ఉట్లు



ధన్వాడ: మండలంలోని గున్ముక్లలో కడపరాయ వేంకటేశ్వర స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం పాలఉట్ల సేవ వైభవంగా కొనసాగాయి. ఉట్లు కొట్టేందుకు పోటీ పడ్డారు. ఉట్ల కార్యక్రమం చూసేందుకు భక్తులు తరలివచ్చారు. బుధవారం స్వామి వారి ఉయ్యాల సేవ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

చెరువుకు చేరని చేప

- ఇప్పటి వరకు 50 శాతం చేపపిల్లలు మాత్రమే సరఫరా
- మండలంలో 57 చెరువులు
- 3.94 లక్షల చేపపిల్లలకు గాను 1.97 లక్షలు పంపిణీ
- ఆందోళనలో మత్స్యకార్మిక సంఘాలు



దామరగిద్ద చెరువుల్లో చేపలను వదుతున్న నాయకుల (ఫైల్)

దామరగిద్ద: ప్రభుత్వం మత్స్యకార్మికులకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో ప్రతి ఏటా ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతుంది. ఈ ఏడాది వర్షాకాలం సమృద్ధిగా వర్షాలు కురిసి అన్ని చెరువుల్లో అలుగుపారాయి. చెరువుల్లో నీళ్లు సమృద్ధిగా ఉన్న ఉచిత సీడ్ చేపపిల్లల పంపిణీలో ప్రభుత్వం ఈ ఏడాది సగానికి తగ్గించింది. మండలంలోని 13 మత్స్యకార్మిక సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 57చెరువులు ఉన్నాయి. అన్ని చెరువులకు మొత్తం 3.94 లక్షల సీడ్ చేపలను పంపిణీ చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. కాగా ప్రభుత్వం నిధుల లేమి కారణంగా సగానికి పైగా తగ్గించినట్లు అధికారులు చెప్పుకొస్తున్నారు.

సీడ్ చేపల పంపిణీ ఇలా..

మండలంలోని ప్రధాన చెరువుల్లో దామరగిద్ద కొత్త చెరువుకు 1.2 లక్షల చేపపిల్లలను కేటాయించగా 51 వేల చేప పిల్లలను అందజేశారు. లక్ష్మీపూర్ నాగమ్మ చెరువుకు 78వేల చేప పిల్లలను కేటాయించగా 39వేలు మాత్రమే చెరువులో వదిలారు. ఇక ఆశన్‌పల్లి ఊర చెరువుకు 48వేలు కేటాయించగా 24వేలు పంపిణీ చేశారు. చాకలోన్‌పల్లి చెరువుకు 36వేలు కేటాయించగా 18వేల చేపలు అందజేశారు. లోకూర్తి ఊర చెరువుకు 33వేలు కేటాయించగా 16500 చేపలను చెరువులో వదిలారు. మల్‌రెడ్డిపల్లికి 67500 కేటాయించగా 33750 చేప పిల్లలను పంపిణీ చేశారు. పిడెంపల్లికి 30వేలు కేటాయించగా 15వేల చేప పిల్లలను అందజేశారు. ఇక మిగిలిన 50చిన్న చెరువులకు చేపపిల్లలను కేటాయించలేదు. చెరువుల్లో నీళ్లు ఉండి చేపలను పెంచేందుకు అవకాశం ఉన్న చేప పిల్లలను కేటాయించకపోవడంతో ఉపాధి తగ్గుతుందని మత్స్యకార్మికులు నిరాశకు గురవుతున్నారు.

సగం మాత్రమే అందజేశారు..



చెరువులకు ఏటా కేటాయించిన మొత్తం చేపలను పంపిణీ చేసేవారు. ఈ ఏడాది మత్స్యశాఖ అధికారులు చెరువుకు కేటాయించిన చేపల్లో సగం మాత్రమే అందజేశారు. చెరువుల్లో నీళ్లు ఉన్న సగం చేపలు మాత్రం వదిలాం. ఎక్కువ మొత్తంలో చేపలు పంపిణీ చేసి ఉంటే చెరువు ద్వారా వచ్చే ఆదాయం పెరిగేది.

- సాయికుమార్, లోకూర్తి

పూర్తిస్థాయిలో పంపిణీ చేశాం..

ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా కేటాయించిన చేప పిల్లలను పూర్తి స్థాయిలో పంపిణీ చేశాం. వాస్తవంగా చేపపిల్లలకు కేటాయించిన నిధులను సమన్వయం చేస్తు ఉన్నతాధికారులు అన్ని చెరువులకు అందించేలా చర్యలు తీసుకున్నారు. చెరువులన్నింటికీ చేప పిల్లలను కేటాయించాం. ఆయా చెరువులకు కేటాయించిన సీడ్ చేపల కోటాలో సగం వరకు సీడ్ చేపలను పంపిణీ చేశాం.

- రహెమాన్, మత్స్యశాఖ ఏడీ, పేట

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



క్రీడా ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధికారులు

నారాయణపేట ఎడ్యుకేషన్: ప్రతి రోజు యోగా సాధన చేయడం వల్ల ఎలాంటి రోగాలు దరిచేరకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఆర్‌డీఓ రాంచందర్ అన్నారు. మంగళవారం స్థానిక సిటిజన్ క్లబ్ ఆవరణలో సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శరీరానికి ఆహారం ఎంత ముఖ్యమో ఆరోగ్యానికి యోగా అంతే ముఖ్యమని, ప్రతిరోజు యోగా చేయాలని అలాగే క్రీడలు ఆడటంతో శారీరకంగా బలంగా ఉంటామన్నారు. కేవలం చదువులలో మాత్రమే కాకుండా క్రీడలలో కూడా ఉన్నత స్థానానికి ఎదగవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అశోక్, ప్రవీణ్‌కుమార్, వ్యాయామ ఉద్యోగులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మక్తల్‌లో పెన్షనర్ల దినోత్సవంలో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగస్తులు

మక్తల్: జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరీ పంక్షన్‌హాల్‌లో రిటైర్డ్ ఉద్యోగులను సంఘం అధ్యక్షుడు గోపాలం ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గోపాలం, కార్యదర్శులు భాస్కర్, సంజన, రాఘవేందర్‌రావు, సిద్దిలింగయ్య, నాగప్ప, సూర్యప్రకాష్, అరుణ, సుజాత, ప్రేమలత, కృష్ణయ్య, విద్యావతి, సురేందర్, మారుతి, సత్యనారాయణ, రాములు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

ఊట్కూరు: ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ మండల అధ్యక్షుడు చౌద్రి చందులాల్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో జాతీయ పెన్షనర్‌ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులను శాలువాతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పెన్షనర్‌లకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని హెల్త్‌కార్డులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగస్తులు సురేష్‌లింగం, సుభాష్, రంగముని, టి కృష్ణయ్య, నందిరామపటేల్, చెన్నబసవప్ప, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



కోస్గిలో నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ నాగరాజు



వద్వాట్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రహమ్మతుద్దీన్



పగిడిమారిలో..

కోస్గి: 'పట్టణంలోని ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరంగా కొనసాగింది. మంగళవారం మున్సిపల్ పరిధిలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల ఆన్‌లైన్ నమోదును మున్సిపల్ కమిషనర్ నాగరాజు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పూర్తి పారదర్శకతతో ఇళ్లనమోదు ప్రక్రియ నిర్వహించాలని వార్డు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ యాదయ్య, వార్డు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు సహకరించాలి

మాగనూర్: మండలంలోని వడ్వాట్‌లో ఇందిరమ్మ ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లవద్ద పంచాయతీ కార్యదర్శులు వెళ్లి వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఎంపీడీఓ రహమ్మతుద్దీన్ మాట్లాడుతూ.. అధికారులు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ప్రజలు సర్వే అధికారులకు కావాల్సిన పత్రాలను అందజేసి వారికి సహకరించాలని కోరారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలో రెండు రోజులుగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతుంది. మంగళవారం ఊట్కూరు, పగిడిమారి, కొండూరు తదిరతర గ్రామాల్లో అధికారులు పాల్గొని ఇంటింటి సర్వే చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు శ్రీనివాసారావు, ఆసీఫా, గ్రామస్తులు ఎండీ అలీం, హన్మంతు, బాలరాజు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



కోస్గి రూరల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే భోజనం మెనూ ప్రకారం నాణ్యతతో అందించాలని ఎంపీడీఓ శ్రీధర్ సూచించారు. ఈ మేరకు మంగళవారం గుండుమాల్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్నభోజనం కోసం వినియోగిస్తున్న బియ్యం నిల్వలను పరిశీలించారు. ఎప్పటికప్పుడు బియ్యం నాణ్యతను తనిఖీ చేసి విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. అనంతరం పాఠశాలకు సంబంధించి పూర్తి చేసిన ప్రహరీ నిర్మాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేష్‌తోపాటు ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



బహుమతుల ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

మక్తల్: పట్టణంలోని శ్రీపడమటి ఆంజనేయస్వామి ఉత్సవాల సందర్భంగా మంగళవారం రిటైర్డ్ ఉద్యోగి లక్ష్మణ్ జ్ఞాపకార్థకంగా సాయిగణేష్ ఆధ్వర్యంలో సందెపురాళ్ల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి 116 కేజీలు బరువును ఎత్తిన బల్లూర్‌కు చెందిన సూరికి 8తులాల వెండి, రెండో బహుమతి కింద 111 కేజీలు ఎత్తిన కున్సి గ్రామానికి చెందిన నర్సింహకు 5తులాల వెండి, మూడో బహుమతి 105 కేజీల ఎత్తిన పంచదేవ్‌పాడుకు చెందిన నాగేష్‌కు మూడు తులాల వెండిని అందజేశారు. అనంతరం పోటీలో గెలుపొందిన వారికి శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రణీష్‌కుమార్, ఈఓ శ్యాంసుందర్, అరవిందు, శోక్‌గౌడ్ పాల్గొన్నారు.

అఖిల భారత యాదవ సభ మండల కమిటీ ఎన్నిక

కోస్గి రూరల్: అఖిల భారత యాదవ మహాసభ గుండుమాల్ మండల కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన మండల స్థాయి యాదవ సభ సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రఘువీర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవ కులస్తులంతా ఏకతాటిపై ఉండి సంఘటితమైతేనే రాజకీయంగా, ఆర్థిక, సామాజికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించొచ్చన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అంజయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శులుగా కృష్ణయ్య, కేశవులు, ఉపాధ్యక్షుడిగా బోగారం వెంకట్రాములు, ముదిరెడ్డిపల్లి మల్లేష్, కృష్ణయ్య, కో–శాధికారిగా మల్లికార్జున్ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పలు మండలాల అధ్యక్షులు, పలు గ్రామాల యాదవులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు తపస్ మద్దతు



సమ్మె వద్ద మాట్లాడుతున్న హన్మంత్‌రావు

నారాయపేట ఎడ్యుకేషన్: స్థానికంగా ఎనిమిది రోజులుగా కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు తపస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని, తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంత్‌రావు అన్నారు. మంగళవారం సమ్మె సందర్శించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని, సమగ్రశిక్షా ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, పేస్కేల్ నిర్ణయించి ప్రమాద బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్న ఉద్యోగులకు సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి, ఉద్యోగులు ఎల్లాగౌడ్, విజయ, రాజు, శశిధర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



మాగనూర్: మండలానికి చెందిన పాటిమిది వెంకటయ్య గతవారంరోజులుగా తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆస్పత్రికి చేరుకుని ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు అవసరమైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

పంచాయతీ కార్మికుల ముందస్తు అరెస్ట్



మక్తల్‌లో అరెస్ట్ అయిన పంచాయతీ కార్మికులు



మరికల్‌లో..

మక్తల్: గ్రామ పంచాయతీ కార్మికుల విషయంలో ప్రభుత్వం మాట తప్పి వారిని అరెస్ట్ చేయించడం సిగ్గుచేటని జిల్లా అధ్యక్షుడు భగవంతు అన్నారు. తమ సమస్యల సాధన కోసం గ్రామ పంచాయతీ కార్మికుల ఇందిరా పార్కు వద్ద తలపెట్టిన ధర్నా నేపథ్యంలో పోలీసులు మంగళవారం పంచాయతీ కార్మికులను కొంతమందిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారినుంచి వ్యక్తిగత పూచికత్తు తీసుకుని వదిలిపెట్టినట్లు తెలిపారు. ఉపాధ్యక్షుడు బుటో తదితరులు కార్మికులు పాల్గొన్నారు.

అరెస్టు చేయడం హేయమైన చర్య..

మరికల్: తమ సమస్యల సాధనకోసం పంచాయతీ కార్మికులు ఇందిరా పార్కు వద్ద తల పెట్టిన ధర్నా నేపథ్యంలో పోలీసులు వారిని అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని జిల్లా కార్యదర్శి రామంజనేయులు అని అన్నారు. అరెస్ట్ చేసిన కార్మికులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సొంత పూచికత్తుపై విడుదల

మద్దూరు: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలను సవరించాలంటూ అసెంబ్లీ ముట్టడికి రాష్ట్ర శాఖ పిలుపునిచ్చిన నేపథ్యంలో వారిని ముందస్తు అరెస్ట్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. 11మందిని అరెస్ట్ చేసి సొంత పూచికత్తుపై విడుదల చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి



మక్తల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నర్వలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు

మక్తల్: లగచర్ల రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మండల బీఆర్ఎస్ నాయకులు బీఆర్. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు.. మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయకపోతే త్వరలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహాగౌడ్, రాజేష్‌గౌడ్, రాజుల ఆశిరెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, మహిపాల్‌రెడ్డి, చిన్నహన్మంతు, రాములు, నర్సింహులు, నాగిరెడ్డి, సాధిక్, భాస్కర్, నిరంజన్‌గౌడ్ పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

ఊట్కూరు: మండలంలోని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లగౌడ్, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, తరుణ్, రంగాచారి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి

నర్వ: మండలంలోని స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు.. ప్రభుత్వ అణిచివేత విధానాలకు నిరసనగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మన్న, నాయకులు శంకర్, సుధీర్, కల్వాల్ ఆంజనేయులు, రఫీ, అశోక్, అజయ్ పాల్గొన్నారు.

కేసులు ఎత్తివేయాలి

మాగనూర్: మండలంలోని రైతులపై ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ స్థానిక అంబేద్కర్‌చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజుల ఆశిరెడ్డి, వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, ఈశ్వర్‌యాదవ్, పల్లెమారెప్ప పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



మక్తల్: పట్టణంలో పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు పూర్ణకుంభంతో వేదపండితులు స్వాగతం పలికి శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, కట్టసురేష్, గణేష్‌కుమార్, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల

ఆత్మకూర్: మండలంలోని పోలింగ్ కేంద్రాల జాబితాను మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా అసిస్టెంట్ ఎన్నికల అధికారి సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి విడుదల చేశారు. ఆత్మకూర్ మండలంలో మొత్తం 114 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, వాటికి సంబంధించిన అభ్యంతరాలు ఇది వరకే స్వీకరించినట్లు తెలిపారు.

బీజేపీ బూత్ కమిటీ ఎన్నిక

అమరచింత: పట్టణంలోని రాంనగర్ కాలనీలో మంగళవారం బీజేపీ బూత్ కమిటీని ఎన్నుకున్నామని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు తెలిపారు. బూత్ అధ్యక్షుడిగా కుమార్, కార్యదర్శిగా శ్రీకాంత్, సభ్యులుగా దేవర్ల రవి, హమాలి వెంకటేష్, పాండు ను నియమించారు. కార్యక్రమంలో రాకేష్ శెట్టి, తోకలి శ్రీనివాసులు పాల్గొన్నారు.

బస్సుజాతాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

అమరచింత: వనపర్తిలో ఈనెల 23న జరిగే ఆశావర్కర్ల బస్సుజాతాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్‌ఎన్.రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం ఆశా కార్యకర్తలతో కలిసి బస్సుజాతాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం నెలకు రూ.18 వేలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. వారాంతపు సెలవులు, క్యాజువల్ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శాంతమ్మ, సంధ్య, సుజాత, రాజేశ్వరి,శ్యామల, అరుణ తదితరులు పాల్గొన్నారు.